సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025



సక్రమంగా సదరం పరీక్షలు

సదరం పరీక్షలు సక్రమంగా జరిపి, పారదర్శకంగా నివేదికలు అందజేయాలని **కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు.** 8లో



సర్పంచులే కీలకం

గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లే కీలకపాత్ర పోషించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ తెలిపారు. 8లో



12 పోలింగ్ కేంద్రాలు

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు సబ్ కలెక్టర్ తెలిపారు. 8లో

విశాఖ డివిజన్‌లోనే కేకే లైన్ కొనసాగించాలి

కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఎంపీ తనూజ రాణి వినతి



కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అరకు ఎంపీ తనూజ రాణి

సాక్షి, పాడేరు: కేకే లైన్‌ను విశాఖ డివిజన్‌లోనే కొనసాగించాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి వినతి పత్రం అందజేశారు. పార్లమెంట్ భవన్‌లో కేంద్ర మంత్రిని ఎంపీ మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను వివరించారు. విశాఖ పర్యాటక భూభాగంలో అరకులోయ ఉందని.. కేకే లైన్‌ను విశాఖ రైల్వే డివిజన్‌లో ఉంచడం వల్ల అరకు లోయ, కిరండూల్ రైల్వే లైన్లు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయని వివరించారు. తల్లిలాంటి వాల్తేరు డివిజన్ నుంచి కేకే లైన్‌ను వేరే చేయడం అంటే తల్లి నుంచి బిడ్డను వేరుచేయడమేనని అన్నారు. రాయగడ డివిజన్‌లో కేకే లైన్‌ను విలీనం చేసే చర్యలను పునఃపరిశీలించాలని కేంద్ర మంత్రికి ఎంపీ విన్నవించారు.

అరకులోయలో రిక్వెస్ట్ స్టాప్ సమస్య పరిష్కారం

ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి చొరవతో అరకులోయలో రైల్వే రిక్వెస్టు స్టాప్ సమస్య పరిష్కారమైంది. కేంద్ర మంత్రికి ఈ సమస్య గురించి కూడా అరకు ఎంపీ సమగ్రంగా వివరించారు. దీంతో కేంద్ర మంత్రి సంబంధిత రైల్వే అధికారులతో మాట్లాడారు. అరకులోయలో రిక్వెస్ట్‌స్టాప్‌ను త్వరితగతిన ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి వైష్ణవ్ ఫోన్‌లో అధికారులను ఆదేశించారు.

వాల్తేరు ఉండాల్సిందే..!

శతాబ్దాల చరిత్ర గల వాల్తేరు **డివిజన్‌ను** కాలగర్భంలో కలిపేసేందు**కు కూటమి** ప్రభుత్వం కుట్రపన్నుతో**ంది. వంచభక్ష్య** పరమాన్నాలు పక్క రాష్ట్రా**నికి అప్పగించి..** ప్రసాదం చేతులో పెడుతుం**టే ఆహా ఓహో** అంటూ గొప్పలు చెప్పుకుం**టున్న కూటమి** నేతల వైఖరిపై విశాఖవా**సులు** మండిపడుతున్నారు. ఆ**దాయం వచ్చే** మార్గాల్ని వాల్తేరు నుంచి **వేరు చేస్తుంటే** పట్టించుకోకపోవడం సిగ్గు**చేటని ఆగ్రహం** వ్యక్తం చేస్తున్నారు. కేకే **లైన్‌తో కూడిన విశాఖ** డివిజనే కావాలంటూ వివి**ధ ప్రజాసంఘాలు,** రైల్వే యూనియన్‌లు డి**మాండ్ చేస్తున్నాయి.**





2023-24లో వాల్తేరు డివిజన్ ఆదాయమిదీ..

నరకు హ్యాండ్లింగ్ 76.48 మిలియన్ టన్నులు	**నరకు రవాణా** ఆదాయం రూ. 9,222.77 కోట్లు
ప్రయాణికుల రాకపోకలు 29.55 మిలియన్లు	ప్రయాణికుల రాకపోకల ద్వారా ఆదాయం రూ. 788.29 కోట్లు
మొత్తం కోచింగ్ రెవెన్యూ రూ. 855.05 కోట్లు	డివిజన్ వార్షికాదాయం రూ. 10,268.72 కోట్లు

శతాబ్దానికి పైగా చరిత్ర ఉన్న డివిజన్ వదులుకోలేం..

కేకే లైన్‌తో కూడిన డివిజన్ ఉండాలని డిమాండ్

ఉద్యమ బాటలో వివిధ ప్రజాసంఘాలు, రైల్వే యూనియన్లు

డివిజన్ కొనసాగించాలని ఆది నుంచీ పట్టుబడుతున్న వైఎస్సార్‌సీపీ

సాక్షి, విశాఖపట్నం : వాల్తేరు డివిజన్.. తూర్పు కోస్తా రైల్వేకు ప్రధాన ఆదాయ వనరు. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా 2019 ఫిబ్రవరి 27న కేంద్ర ప్రభుత్వం విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. విశాఖ రైల్వే జోన్ రాక ఓవైపు ఆనందాన్ని కలిగించినా.. వాల్తేర్ డివిజన్ ప్రధాన కేంద్రంగా రాయగడను ప్రకటించడం అందర్నీ నిరాశకు గురిచేసింది. వాల్తేరు డివిజన్‌ను రెండు భాగాలుగా చేసి ఒక భాగాన్ని విజయవాడ డివిజన్‌లోనూ.. మరో భాగాన్ని కొత్తగా ఏర్పాటు చేయనున్న రాయగడ డివిజన్‌లోనూ కలుపుతున్నట్లు ప్రకటించింది. అయితే.. వాల్తేరు డివిజన్‌ని కొనసాగించాలంటూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కూడా పలుమార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఆ పార్టీ ఎంపీలు కూడా ఈ అంశాన్ని పార్లమెంట్‌లో లేవనెత్తారు. దీనిపై పునరాలోచిస్తామంటూ కేంద్రం డివిజన్ అంశాన్ని హోల్డ్‌లో పెట్టింది. ఇప్పుడు అత్యధిక రాబడిని ఇచ్చే కేకే లైన్ లేకుండానే విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ స్వరూపాన్ని ఖరారు చేస్తూ కేంద్ర రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. అరకు లోయతో సహా కేకే లైన్‌ను రాయగడ డివిజన్‌లో చేర్చింది. దాంతో కొత్తగా ఏర్పడే విశాఖ రైల్వే డివిజన్ రాబడికి భారీగా గండి పడనుంది. దీనిపై సర్వత్రా వ్యతిరేకతా వ్యక్తమవుతోంది.

కొత్త జోన్‌కు వాల్తేరే కీలకం

తూర్పు కోస్తా రైల్వే జోన్‌కు ఆదాయాన్ని తెచ్చిపెట్టే అతిపెద్ద డివిజన్ వాల్తేరు. ఏటా దాదాపు 3 కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలు సాగిస్తున్నారు. తూర్పు కోస్తా రైల్వే జోన్ సరకు రవాణా, ఇతరత్రా ఆదాయం ఏటా దాదాపు రూ.17 వేల కోట్లు కాగా, ఇందులో రూ.10 వేల కోట్లు వాల్తేరు డివిజన్ నుంచే వస్తోంది. సాధారణ టికెట్ల ద్వారా ఏటా రూ.788.29 కోట్లు వరకూ వస్తోంది. ఇది ఈస్ట్ కోస్ట్ జోన్ ప్రధాన కేంద్రం భువనేశ్వర్ కంటే 30 శాతం ఎక్కువ. దేశంలోనే సుమారు 300 డీజిల్ ఇంజన్లున్న అతిపెద్ద లోకోషెడ్, 160 ఇంజన్లుండే భారీ ఎలక్ట్రికల్ లోకోషెడ్, విశాలమైన మార్షలింగ్ యార్డు కూడా ఇక్కడే ఉన్నాయి. తూర్పు కోస్తాలోనే ఎక్కువ ప్యాసింజర్, సరకు రవాణా వ్యాగన్ ట్రాఫిక్ కలిగిన డివిజన్ విశాఖ. ఇందులో సింహభాగం ఆదాయం ఐరన్ ఓర్ రవాణా జరిగే కేకే లైన్, మొదలైన ప్రధాన మార్గాల ద్వారానే వస్తుంటుంది. వాల్తేరు డివిజన్ పరిధిలో ఏటా సరకు రవాణా ద్వారా రూ.9,222.77 కోట్ల వరకూ ఆదాయం వస్తుంది. ఇప్పుడు ఇదంతా రాయగడ డివిజన్‌కు సొంతమవుతుంది. కొత్త జోన్‌కు రావాల్సిన ఆదాయం మొత్తం ఒడిశా పరిధిలోని రాయగడకు వెళ్లిపోతుంది. జోన్ అభివృద్ధి చెందాలంటే కచ్చితంగా కేకే లైన్ వాల్తేరు పరిధిలో ఉండాల్సిందేనని డివిజన్ అధికారులు చెబుతున్నారు. కేకే లైన్ లేకపోతే.. విశాఖ డివిజన్ ఆదాయం రూ.3 వేల కోట్లు కూడా దాటే అవకాశం లేదు. దీంతో కొత్త జోన్ అభివృద్ధి సక్రమంగా జరిగే అవకాశం లేదని ఆందోళన వ్యక్తమవుతోంది.

వాల్తేరు కనుమరుగైతే.. కూటమి నేతలకు ఆనందమా.?

శతాబ్దానికిపైగా చరిత్ర ఉన్న వాల్తేరును విచ్ఛిన్నం చేసి.. కొత్తగా ఆదాయ మార్గాల్లేని విశాఖ డివిజన్‌గా ప్రకటిస్తే కూటమి పార్టీలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సదరు నేతలకు వాల్తేరు చరిత్ర గురించి తెలియదా అంటూ దుమ్మెత్తి పోస్తున్నారు. కేంద్రం తీసుకుంటున్న నిర్ణయం వల్ల.. విశాఖ కేంద్రంగా రాబోతున్న జోన్ ఆదాయానికి గండి పడుతుందని అంతా ఆందోళన చెందుతుంటే.. కూటమి నేతలు మాత్రం ఆనందం వ్యక్తం చేయడం సరికాదంటున్నారు. ఇప్పటికైనా మేల్కొని కేకే లైన్‌తో కూడిన విశాఖ డివిజన్ లేదా.. పాత వాల్తేరు డివిజన్ సాధించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



వాల్తేరు డివిజన్ కొనసాగించాలంటూ ఉద్యమిస్తున్న ఉద్యోగ, కార్మిక సంఘాలు(ఫైల్)

వాల్తేరు చరిత్ర ఇదీ..

- 1893లో బ్రాడ్‌గేజ్ ఆపరేషన్స్‌తో కటక్-విశాఖ-విజయవాడ మధ్య ప్రారంభమైంది
- 1931 నుంచి వాల్తేరు డివిజన్ బెంగాల్ నాగ్‌పూర్ రైల్వే పరిధిలో నడిచింది.
- 1952 నుంచి ఈస్ట్రన్ రైల్వే పరిధిలో వాల్తేరు డివిజన్ ఉండేది.
- 1955 నుంచి సౌత్ ఈస్ట్రన్ రైల్వే పరిధిలోకి వెళ్లింది
- 2003 నుంచి ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలోకి వెళ్లింది
- 1968లో కేకే లైన్ ప్రారంభం
- 1996లో కొరాపుట్-రాయగడ లైన్ ప్రారంభం
- వాల్తేరు రూట్ విస్తీర్ణం- 1106 కి.మీ
- వాల్తేరు ట్రాక్ విస్తీర్ణం- 2,364 కిమీ
- మొత్తం స్టేషన్లు- 115
- డివిజన్ పరిధిలో ఉద్యోగులు- గెజిటెడ్-126, నాన్‌గెజిటెడ్- 17571

వాల్తేరుకు ప్రత్యేక గుర్తింపు



దశాబ్దానికిపైగా చరిత్ర ఉన్న వాల్తేరు డివిజన్‌ను విడదీయాలనుకోవడం సరికాదు. ఈ డివిజన్‌కు దేశ రైల్వే చరిత్రలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. కేకే లైన్ అంటే వాల్తేరు.. వాల్తేరు అంటే.. కేకే లైన్. అలాంటి ప్రాంతాన్ని రాయగడకు అప్పగించడం సరికాదు. కొత్త విశాఖ డివిజన్ వల్ల జోన్‌కు పెద్దగా ఒరిగేది లేదు. జోన్ ఎంత సెంటిమెంటో.. డివిజన్ కూడా ఉత్తరాంధ్ర ప్రజలకు అంతే సెంటిమెంట్. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు రాజీలేని పోరాటం చేయాలి.

– బి.కృష్ణారావు, విశ్రాంత రైల్వే ఉద్యోగి

ఆవేదన కలిగిస్తోంది..



వాల్తేరు డివిజన్ విభజించి.. విశాఖ డివిజన్ ఏర్పాటు చేసినా.. ఆదాయం పూర్తిగా కోల్పోయే ప్రమాదముంది. దాదాపు 130 ఏళ్ల చరిత్ర ఉన్న వాల్తేరు డివిజన్‌లో 17 వేల మందికి పైగా ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఆదాయం తెచ్చిపెట్టే కొత్తవలస-అరకు రాయగడ డివిజన్‌కు వెళ్లిపోవడం ఆవేదన కలిగిస్తోంది. కొత్త జోన్ అభివృద్ధి చెందాలంటే ఈ మార్గం వాల్తేరులోనే ఉండాలి.

– డా.పెదిరెడ్ల రాజశేఖర్‌రెడ్డి, సౌత్ కోస్ట్ రైల్వే ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు

వాల్తేరుపై పట్టున్న అధికారినే జీఎంగా నియమించాలి



ఆదాయ మార్గాలు లేని విశాఖపట్నం డివిజన్ ఏర్పాటు చేసినా ఎలాంటి ఉపయోగం ఉండదు. ఒకవేళ విభజించాల్సి వస్తే.. పలాస ప్రాంతాన్ని ఖుర్దాలోనే ఉంచి.. కిరండూల్ మార్గాన్ని విశాఖ డివిజన్‌లో కలపాలి. జోన్ కార్యకలాపాలు వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు జీఎంని నియమించాలి. వాల్తేరు డివిజన్‌లో పనిచేసిన అనుభవం ఉండి.. పీపుల్స్ డీఆర్‌ఎంగా పేరుతెచ్చుకున్న వారిని ఇక్కడ నియమిస్తే.. జోన్ త్వరితగతిన అభివృద్ధి చెందుతుంది.

– కార్తీక్ వంశీ, సేవ్ వాల్తేర్ ప్రతినిధి, విశాఖపట్నం

న్యూస్‌రీల్

డోకులూరు ఆశ్రమ పాఠశాల వార్డెన్ సస్పెన్షన్

- ముగ్గురు టీచర్లకు షోకాజ్ నోటీసులు
- ఇంగ్లిష్ టీచర్ మెడికల్ బోర్డుకు రిఫర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన డోకులూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల వార్డెన్ పి.సింహాద్రిని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ సస్పెండ్ చేశారు. అదే పాఠశాలకు చెందిన ముగ్గురు టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో పాటు, ఇంగ్లిష్ టీచర్‌ను మెడికల్ బోర్డుకు రిఫర్ చేశారు. వివరాలు... డోకులూరు ఆశ్రమపాఠశాలను గురువారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో కొంతమంది విద్యార్థులు ఆరుబయట తిరగడాన్ని చూశారు. వారిని కలెక్టర్ ప్రశ్నించగా సరైన సమాధానం రాలేదు. వెంటనే వార్డెన్ సింహాద్రిని సంజాయిషీ కోరారు. వార్డెన్ వివరణ పట్ల సంతృప్తి చెందని కలెక్టర్ ఆయనను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అనంతరం 7,8,9 తరగతుల విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులను పలు పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలను రాబట్టారు.బేస్‌లైన్ పరీక్షల్లో వారికి కేటాయించిన గ్రేడ్లపై ఆరా తీశారు.అందుకు ఆయా తరగతుల ఉపాధ్యాయులు సరైన సమాధానం చెప్పకపోవడంతోకలెక్టర్ వారిని మందలించి, ముగ్గురు టీచర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. తరచూ మెడికల్ లీవ్‌లో వెళ్తున్న ఇంగ్లిష్ టీచర్ వల్ల ఆంగ్ల విద్యా బోధన కుంటుపడుతోందని గమనించిన కలెక్టర్ ఆ ఉపాధ్యాయుడు రామ్‌సాగర్‌ను మెడికల్ బోర్డుకు రిఫర్ చేయాలని ఆదేశించారు.

108 అడుగుల శ్రీకృష్ణుడి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన



విగ్రహ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే మత్స్యలింగం

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని గుమ్మకోటలో 108 అడుగుల శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం గురువారం అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం భూమి పూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధ్యాన కరుణ మహా చక్రం ప్రకృతి వ్యాలీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి విగ్రహం ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ఎంపీటీసీ తవిటి నాయుడు, సర్పంచ్‌లు పాగి అప్పారావు, మధులత, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు కొర్రా సూర్యనారాయణ, నాయకులు తిరుపతి, పాడి కృష్ణమూర్తి, శ్రీను, ఈశ్వరరావు, కృష్ణ పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు.చలి అరకు ఉత్సవంలో పాల్గొన్న అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసి సంబంధిత గ్రామాలకు నిర్వహణ బాధ్యత అప్పగిస్తే గిరిజనులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో పంచాయతీరాజ్, అటవీశాఖ అధికారులు గిరిజన చట్టాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. గిరిజన ఆవాసాల్లో పర్యాటకులు హోంస్టే ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాడేరు, రంపచోడవరం,చింతూరు డివిజన్ల పరిధిలోని పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని,అడ్వంచర్ టూరిజంతో పాటు గిరిజన కళాకారులను గుర్తించాలన్నారు. అనంతరం చలి అరకు ఉత్సవాన్ని విజయవంతం చేసిన అధికారులను అభినందించి, షీల్డ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ,సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్,డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి,డీఆర్‌వో పద్మలత, డీఆర్‌డీఏ పీడీ మురళీ,డీపీవో లవరాజు,డీఎల్‌పీవో పి.ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్,పక్కన జేసీ అభిషేక్‌గౌడ

డ్వాక్రా సభ్యులకు తెలియకుండానే ఖాతాల్లోకి డబ్బులు

- మూడు సంఘాల అకౌంట్లలో రూ.60 లక్షలు జమ
- విచారణ జరిపిన అధికారులు

రాజవొమ్మంగి: మండలంలోని మూడు డ్వాక్రా గ్రూపులకు చెందిన సభ్యులకు తెలియకుండానే ఆయా సంఘాల ఖాతాల్లో రూ.20 లక్షల చొప్పున జమ అయ్యాయి. తమ సంఘాల అకౌంట్లలో అంత సొమ్మును చూసిన సభ్యులు అవాక్కయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజవొమ్మంగి వెలుగు కార్యాలయం పరిధిలోని సుబ్బంపాడు గ్రామానికి చెందిన అరుణ, స్రవంతి సంఘాలతో పాటు మరో సంఘానికి రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ.60 లక్షలు జనవరి 31వ తేదీన జమ అయ్యాయి. పాత బకాయిలు కట్టేందుకు స్థానిక యూనియన్ బ్యాంకుకు వెళ్లిన సభ్యులు తమ ఖాతాల్లో ఉన్న భారీ మొత్తాన్ని చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. సంఘం తరఫున తీర్మానం లేకుండా, సంఘ సభ్యులు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోయినా ఈ సొమ్ము ఖాతాల్లోకి ఎలా వచ్చిందో తెలియక గందరగోళానికి గురయ్యారు. ఆ రుణాలకు చెందిన వడ్డీ భారం తమపై పడుతుందని ఆందోళన చెందుతున్నారు. కాగా ఈ విషయం తెలిసిన స్థానిక వెలుగు ఏపీఎం రామాంజనేయులు గురువారం సీసీలతో విచారణ జరిపించారు. రుణాలు మంజూరు కావాలంటే తీర్మాన పత్రాల పై వెలుగు ఏపీఎం, వెలుగు సీసీల సంతకాలు తప్పని సరిగా ఉండాలని, అవేవీ లేకుండానే మూడు సంఘాలకు రూ. 60 లక్షల మేర రుణాలు మంజూరైనట్టు విచారణలో తేలిందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారల దృష్టికి తీసుకొని వెళతామని ఏపీఎం రామాంజనేయులు విలేకరులకు తెలిపారు.



డ్వాక్రా సభ్యులను విచారిస్తున్న వెలుగు అధికారులు

14 మంది విద్యార్థినులకు అస్వస్థత

వివరాలు 8లో

గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు
- జిల్లా ఆస్పత్రి, ప్రభుత్వ మెడికల్ కళాశాలల తనిఖీ

పాడేరు: జిల్లా ఆస్పత్రికి వచ్చే గిరిజన రోగులతో వైద్యులు, సిబ్బంది ప్రేమగా వ్యవహరించి, మెరుగైన వైద్యసేవలందించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి. శంకర్‌రావు సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా గురువారం ఆయనతోపాటు, కమిషన్ సభ్యులు జంపరంగి లిల్లీ, కొర్రా రామలక్ష్మి, వడిత్య శంకర్‌నాయక్‌లు జిల్లా ఆస్పత్రి, ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తనిఖీ చేశారు. జిల్లా ఆస్పత్రిలో వార్డులకు వెళ్లి రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలతో పాటు సరఫరా చేస్తున్న ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించి వైద్య విద్యార్థులతో ముచ్చటించారు. కళాశాలలో నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించి, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఎస్టీ కమిషన్ బృందం వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ టి.నర్సింగరావు తదితరులు ఉన్నారు.



మెడికల్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావు, సభ్యులు

అరకులోయ అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ, ఇతర పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశేషంగా కృషిచేసినట్టు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి. శంకరరావు తెలిపారు. గురువారం ఆయన అరకులోయలో ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు ఫామ్ హౌస్‌లో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కోట్ల రూపాయలు వెచ్చించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు దంపతులతోపాటు కమిషన్ సభ్యులను ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పాంగి చిన్నారావు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యులు కొర్రా రామలక్ష్మి, తడబారికి లిల్లీ సురేష్, వైఎస్సార్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ తడబారికి సురేష్ కుమార్, మాజీ సర్పంచ్‌లు గుడివాడ ప్రకాష్, గొల్లోరి ప్రసాద్,పాంగి సురేష్‌కుమార్, పొట్టంగి రామ్ ప్రసాద్, మాజీ ఎంపీటీసీ భూర్జ సుందర్ రావు, పార్టీ నాయకుడు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్‌రావు దంపతులను సన్మానిస్తున్న పాంగి చిన్నారావు తదితరులు

అయ్యన్న వ్యాఖ్యలపై సుమోటోగా కేసు

- రాష్ట్రపతి, గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్ లేఖలు
- ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్

సాక్షి, పాడేరు: గిరిజనుల మనోభావాలకు విరుద్ధంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టాన్ని సవరించాలని వ్యాఖ్యలు చేయడంపై అన్ని వర్గాల నుంచి అభ్యంతరాలు వస్తున్నాయని, సుమోటా కేసుగా స్వీకరిస్తామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్ చెప్పారు. పంచాయతీ కేంద్రమైన మినుములూరులోని ఏకలవ్య ఫౌండేషన్ రైతు ఉత్పత్తిదారుల కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఆయనకు సర్పంచ్ లంకెల చిట్టమ్మ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం సేవలపై ఆయన సమీక్షించారు. పంచాయతీలోని ప్రధాన సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధ్యాతయుతమైన స్పీకర్ పదవిలో ఉన్న అయ్యన్నపాత్రుడు 1/70 చట్టాన్ని సవరించి, ఏజెన్సీ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని మాట్లాడడంపై గిరిజనులు ఆగ్రహంతో ఉన్నారన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, గిరిజన సమాజానికి క్షమాపణ చెప్పాలనే డిమాండ్‌తో గిరిజన, ప్రజా సంఘాలు ఈనెల 11, 12 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల బంద్‌కు పిలుపునిచ్చాయని తెలిపారు. గిరిజనుల హక్కులు, చట్టాలను పరిరక్షించాల్సిన బాధ్యత ఎస్టీ కమిషన్‌పైన, సభ్యులమైన తమపైన ఉందన్నారు. స్పీకర్ వ్యాఖ్యలపై రాష్ట్రపతి, గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు పంపుతామని ఆయన తెలిపారు. మినుములూరు అభివృద్ధికి విశేషంగా కృషిచేయడంతో పాటు ఉత్తమ సర్పంచ్ పురస్కారం అందుకున్న లంకెల చిట్టమ్మను ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్ దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.



మాట్లాడుతున్న శంకర్‌నాయక్

క్లుప్తంగా

వైద్య కళాశాల విద్యార్థులకు యోగా శిక్షణ


యోగాలో శిక్షణ పొందుతున్న వైద్య కళాశాల విద్యార్థులు

సాక్షి, పాడేరు: ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులకు గురువారం యోగా శిక్షణ తరగతులను ప్రారంభించారు. యోగా గురువు పతంజలి శ్రీనివాస్ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలతాదేవి మాట్లాడుతూ ఎంబీబీఎస్ విద్య ఒత్తిడితో కూడి ఉంటుందన్నారు. యోగా, ధ్యానంతో చదువులో ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు. నిత్యం యోగా చేయడం వల్ల క్రమశిక్షణతో కూడిన విద్య, ధైర్యం వంటి లక్షణాలు అలవాటవుతాయని తెలిపారు.

పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

రాంబిల్లి(యలమంచిలి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రాంబిల్లి ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రాంబిల్లి మండలం కట్టుబోలు గ్రామానికి చెందిన కర్రి దాలినాయుడు(58) ఈ నెల 3న ఆర్థిక సమస్యల కారణంగా తన ఇంటి వద్ద పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఆయనను కుటుంబ సభ్యులు విశాఖపట్నం కేజీహెచ్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుని భార్య కర్రి అమ్మాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఎగుమతుల రంగంలో ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న దువ్వాడ ఎస్ఈజెడ్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్

అక్కిరెడ్డిపాలెం: మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) విశాఖ శాఖ, డీజీఎఫ్‌టీ, వాసీవా, ఏపీ చాంబర్ సంయుక్త ఆధ్వర్యంలో ఎగుమతి ప్రోత్సాహం, ఎంఎస్ఎంఈ పథకాలపై గురువారం ఒక్క రోజు జాతీయ వర్క్‌షాపు జరిగింది. షీలానగర్‌లోని ఒక హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో దువ్వాడ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎగుమతుల ప్రోత్సాహకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. దువ్వాడ ఎస్ఈజెడ్‌లో అందుబాటులో ఉన్న వివిధ సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. వివిధ ఎగుమతుల ప్రోత్సాహక పథకాలు, నిరాయత్ బంధు పథకాల గురించి వివరించారు. ఎగుమతుల రంగంలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. పరిశ్రమల జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు కావాల్సిన అన్ని రకాల అనుమతులు, విధివిధానాలను వివరించారు. పలువురు పారిశ్రామికవేత్తలు మాట్లాడుతూ ప్రొక్యూర్‌మెంట్ పాలసీని పక్కాగా అమలు చేయాలని కోరారు. రూరల్ ఏరియాలో ఎంఎస్ఎంఈలను ఇంకా అభివృద్ధి చేయాలని అభిప్రాయపడ్డారు. భారత విదేశీ వాణిజ్య సంస్థ (డీజీఎఫ్టీ), కస్టమ్స్ డిపార్ట్‌మెంట్, ఎగుమతి క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్, భారత పోస్టల్ శాఖ, ఎగుమతుల తనిఖీ మండలి, ఏపీఈడీఏ, ఎఫ్ఐఈవో, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు, పలు బ్యాంకుల అధికారులు అమలు చేస్తున్న పథకాలు, విధివిధానాలను వివరించారు. విశాఖ డీఎఫ్‌వో ఎంఎస్ఎంఈ ఏడీ శ్రీను అప్పికొండ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏడీ చంద్ర మౌళి జంగం, ఎస్ఈజెడ్ లీ ఫార్మా అధికారి లీలా రాణి, విశాఖపట్నం ఎక్స్‌పోర్ట్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ బ్రాంచ్ మేనేజర్ దత్తా పాల్గొన్నారు.

గుండెనొప్పి రోగికి గోల్డెన్ అవర్‌లో చికిత్స

టెనెక్టిప్లస్ ఇంజెక్షన్ చేసి ప్రాణాలు కాపాడిన వైద్యులు

చింతూరు: గుండెనొప్పితో బాధపడుతున్న రోగికి గోల్డెన్ అవర్‌లో రూ.45 వేల విలువచేసే టెనెక్టిప్లస్ ఇంజెక్షన్ చేసి చింతూరు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు ఆయన ప్రాణాలు కాపాడారు. చింతూరు మండలం కొత్తపల్లికి చెందిన చంటి అనే వ్యక్తికి గుండెనొప్పిగా ఉండడంతో తులసిపాక పీహెచ్‌సీకి వెళ్లాడు. అక్కడ అతనిని పరీక్షించిన వైద్యుడు చింతూరు ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. ఆయనకు చింతూరు ఆస్పత్రిలో ఈసీజీ పరీక్షలు నిర్వహించగా గుండెనొప్పిగా నిర్ధారణైంది. దీంతో సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి, ఫిజీషియన్ డాక్టర్ సాయికిషోర్‌లు వెంటనే ఇటీవల ఆస్పత్రిలోకి అందుబాటులోకి వచ్చిన టెనెక్టిప్లస్ ఇంజెక్షన్ చేయడంతో అతను ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గుండెనొప్పికి తక్షణ వైద్యసాయం అందక ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని అలాంటి వారికోసం తక్షణ ప్రాథమిక చికిత్సలో భాగంగా ఈ ఇంజెక్షన్ ఎంతగానో దోహదపడుతుందని సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి తెలిపారు. చింతూరు ప్రభుత్వాస్పత్రిలో ఈ ఇంజెక్షను ద్వారా ఇప్పటికి ఇద్దరి ప్రాణాలు కాపాడినట్లు ఆయన తెలిపారు. ఛాతీనొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఉన్నవారికి గోల్డెన్ అవర్ ఎంతో కీలకమని డాక్టర్ సాయికిషోర్ తెలిపారు.

అలాంటి వారు వెంటనే ఆస్పత్రికి వస్తే వారికి ఈ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా రక్తం గడ్డ కట్టకుండా చేయడంతో పాటు మెరుగైన వైద్యం అందించే ఆస్కారముంటుందని ఆయన తెలిపారు.


గుండెనొప్పి రోగిని పరీక్షిస్తున్న సూపరింటెండెంట్ కోటిరెడ్డి, ఫిజీషియన్ సాయికిషోర్

అందుబాటులో గుండెపోటు ఇంజెక్షన్


సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్‌బాబు

కూనవరం: మండల పరిధిలోని కోతులగుట్ట సామాజిక ఆరోగ్య కేంద్రంలో(సీహెచ్‌సీ) గుండె నొప్పి ఇంజక్షన్ అందుబాటులో ఉందని సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్‌బాబు గురువారం తెలిపారు. రూ.50 వేలు విలువైన టెనెక్టప్లస్ట్ ఇంజెక్షన్ ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. గుండెపోటుకు గురైన వారు వెంటనే కోతులగుట్టలోని ప్రభుత్వాస్పత్రికి వచ్చినట్లు అయితే ఈసీజీ పరీక్షలు నిర్వహిస్తామని, అవసరమైన వారికి అత్యంత టెనిస్ట్‌ప్లేజ్ ఇంజెక్షన్ ఇస్తామని చెప్పారు. ఇటీవల ఎటపాక మండలానికి చెందిన ఒక వ్యక్తికి గుండె నొప్పి రావడంతో కోతులగుట్ట సీహెచ్‌సీకి అతని బంధువులు తీసుకురావడంతో రూ. 50 వేలు విలువైన టెనెక్ట్‌ప్లెస్ ఇంజెక్షన్ ఇచ్చినట్టు చెప్పారు. కూనవరం, విఆర్‌పురం, ఎటపాక మండలాల్లో ప్రజలు ఎవరినా గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారు ఉన్నట్లు అయితే వెంటనే కూనవరం మండలం కోతులగుట్ట సీహెచ్‌సీకి వచ్చి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

14 మంది విద్యార్థినులకు అస్వస్థత

- 8 మందికి వాంతులు,విరోచనాలు
- ఆరుగురికి జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు
- చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో చికిత్స


చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న కేజీబీవీ విద్యార్థినులు

వై.రామవరం(అడ్డతీగల): వై.రామవరం మండలం తోటకూరపాలెం కేజీబీవీలో 14 మంది విద్యార్థినులు గురువారం అస్వస్థతకు గురయ్యారు. వారిని ఉపాధ్యాయులు, సిబ్బంది చవిటిదిబ్బలు పీహెచ్‌సీకి తరలించారు. వీరిలో ఎనిమిది మంది విద్యార్థినులు వాంతులు, విరోచనాలతో, మిగతా ఆరుగురు జ్వరం, గొంతు ఇన్ఫెక్షన్,జలుబు వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు వైద్యుడు నరేంద్ర తెలిపారు. ఎల్.సౌజన్య అనే బాలికకు జ్వరం తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేసినట్టు తెలిపారు.వాంతులు,విరోచనాలు,జ్వరంతో బాధపడుతున్న ఎల్లబల్లి దీపిక, గంతా రేష్మ ప్రియ, బచ్చల చాందిని, సిడెం శ్రావ్య, ఉయ్యాల పార్వతి అనే విద్యార్థినులు ఇన్‌పేషెంట్లుగా పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నట్టు చెప్పారు. వీరిని మూడు రోజుల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచుతామన్నారు. మిగతా ఎనిమిది మందిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్టు తెలిపారు. శుభ్రత పాటించకుండా ఆహారం తీసుకోవడం వల్ల వాంతులు,విరోచనాలు కావడానికి అవకాశం ఉందన్నారు.విద్యార్థినులు అనారోగ్యానికి గురికావడంతో ఆస్పత్రికి తరలించినట్టు కేజీబీవీ ప్రిన్సిపాల్ కె.వి. లక్ష్మి తెలిపారు. మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్టు ఆమె చెప్పారు.

సక్రమంగా సదరం పరీక్షలు

- పారదర్శకంగా నివేదికలు ఇవ్వాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్

పాడేరు: జిల్లా ఆస్పత్రిలో నిర్వహిస్తున్న సదరం పరీక్షలు సక్రమంగా జరిపి, పారదర్శకంగా నివేదికలు అందజేయాలని, ధ్రువీకరణ పత్రాల జారీలో అలసత్వం వద్దని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో నిర్వహిస్తున్న సదరం శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం సదరం ధ్రువీకరణ పత్రాల రీవెరిఫికేషన్ జరుగుతోందని అందుకు దివ్యాంగులు సహకరించాలన్నారు. అనంతరం ఆస్పత్రిలో వివిధ వార్డులను సందర్శించారు. వివిధ వ్యాధులతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెదబయలు మండలం మారుమూల గిన్నెలకోటకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులను పరామర్శించారు. ఆస్పత్రిలో సిటి స్కాన్ పనితీరును, ల్యాబ్, ఫార్మసీ విభాగాలను పరిశీలించి అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఫార్మసీలో కాలం చెల్లిన మందులను గుర్తించి, వాటిని డిస్పోజ్ చేసే విధానాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర, డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ టి. నర్సింగరావు, డీఆర్డీఏ పీడీ మురళి తదితరులు ఉన్నారు.

ఆర్గానిక్ కాఫీకి అంతర్జాతీయ ధరలు


మాట్లాడుతున్న జీసీసీ మార్కెటింగ్ జీఎం ఉమాదేవి, చింతపల్లి డీఎం దేవరాజ్

చింతపల్లి: పూర్తిగా సేంద్రియ పద్ధతుల్లో కాఫీని పండించే రైతులకు అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న ధరలకు అనుగుణంగా మంచి ధరలు చెల్లిస్తామని గిరిజన సహకార సంస్థ మార్కెటింగ్ జనరల్ మేనేజర్, విజిలెన్స్ అధికారి ఉమాదేవి అన్నారు. మండలంలోని లంబసింగి, గొందిపాకలు, తాజంగి, పెదబరడ పంచాయతీల్లోని పలు గ్రామాల్లో ఆమె గురువారం పర్యటించారు. కాఫీని సాగు చేస్తున్న గిరిజన రైతులతో మాట్లాడారు. కాఫీకి ఈఏడాది అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందన్నారు. రైతులు పండిస్తున్న ఆర్గానిక్ కాఫీకి మరింత ధరలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఇందుకు అనుగుణంగా తమ జీసీసీ ఎండీ కాఫీకి గిట్టుబాటు ధరలను ప్రకటించారన్నారు. ప్రస్తుతం సాధారణ పార్చిమెంటు కాఫీకి ధర కిలో రూ.400 , చెర్రీ కాఫీకి రూ.250 రొబస్టాకు రూ.160 చెల్లిస్తున్నామన్నారు. ఆర్గానిక్ కాఫీకికి కిలో పార్చిమెంటు ధర రూ.450, కిలో చెర్రీ కాఫీకి ధర రూ.330గా ప్రకటించినట్టు తెలిపారు. గతంలో తమ జీసీసీ చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లోని జీసీసీకి కాఫీని విక్రయిస్తే వారికి మంచి ధరలు లభించే అవకాశం ఉందన్నారు. కాఫీని దళారులు, వ్యాపారులకు విక్రయించడం వల్ల తూకాల్లో మోసాలు, అధిక వడ్డీలు వంటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. వీటిని రైతులు గుర్తించి జీసీసీకి కాఫీని విక్రయించాలని ఆమె కోరారు. చింతపల్లి జీసీసీ డీఎం దేవరాజ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 12 పోలింగ్ కేంద్రాలు

రంపచోడవరం: ఉభయ గోదావరి జిల్లాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ చెప్పారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఎస్పీ సాయి ప్రశాంత్‌తో కలిసి గురువారం సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రంపచోడవరం, చింతూరు డివిజన్‌ల్లో 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎన్నికల్లో 4664 మంది పట్ట భద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని తెలిపారు. ఏజెన్సీలో 11 మండలాల్లో 11 పోలింగ్ కేంద్రాలతో పాటు వై రామవరం అప్పర్ పార్ట్‌లోని డొంకరాయిలో ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నెల 27న పోలింగ్ ముగిసిన తరువాత పటిష్ట భద్రత మధ్య బాక్సులను ఏలూరు స్ట్రాంగ్ రూమ్‌కు తరలించనున్నట్టు పేర్కొన్నారు. డీఎస్పీ సాయి ప్రశాంత్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, సమావేశాల నిర్వహణకు 48 గంటలకు ముందే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అనుమతులు పొందాలన్నారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తహసీల్దార్ పి.రామకృష్ణ, నాయకులు కొమ్మిశెట్టి బాలకృష్ణ, అనంత మోహన్, వెంకన్నబాబు, బొజ్జిరెడ్డి, బాలురెడ్డి, వాణిశ్రీ,, సంతోష్‌కుమార్, డీటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో సర్పంచులే కీలకం

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ


సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు

పాడేరు రూరల్: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచులు కీలకపాత్ర పోషించాలని జాయింట్ కలెక్టర్ ఎం.జె, అభిషేక్‌గౌడ తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల మండలాల సర్పంచ్‌లతో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 12న విజయవాడలో జరుగుతున్న సమవేశానికి ఆయా సర్పంచ్‌లందరూ హాజరుకావాలన్నారు. వీరిలో హుకుంపేట మండలం నుంచి మతం, తీగలవలస, తడిగిరి, మట్టుజోరు, గడికించుమండ, పాడేరు మండలం నుంచి కిండంగి, మినుములూరు, గుత్తులపుట్టు, డోకులూరు, కాడెలి, జి.మాడుగుల మండలం నుంచి పెద్దలోచలి, వంతాల, గడుతూరు, నుర్మతి, కుంబిడిసింగి సర్పంచ్‌లు పాల్గొననున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు కూడా హాజరుకానున్నట్టు చెప్పారు. గ్రామల్లో నెలకొన్న ప్రధాన సమస్యలు, స్థితిగతులపై చర్చించేందుకు ప్రత్యేక వేదిక కానుందన్నారు. విద్య, వైద్యం వ్యవసాయం, రహదారుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వికసిత పంచాయతీలకు ప్రభుత్వ పథకాలు పొందడానికి అవకాశం ఉందన్నారు. జిల్లా పంచాయతీ అధికారి లవరాజు, డివిజనల్ అధికారి పి.ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేజ్ కల్చర్‌పై శిక్షణ

సుజనకోటలో మత్స్యపరిశోధన శాస్త్రవేత్తల పర్యటన


సుజనకోటలో గిరిజన మత్స్యకారులకు బోటు అందజేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రంలో గురువారం విశాఖపట్నం రీజినల్ కేంద్రానికి చెందిన సాగర మత్స్య పరిశోధన సంస్థ శాస్త్రవేతల బృంద సభ్యులు కలెక్టర్ ఆదేశాల మేరకు పర్యటించారు. సుజనకోట గ్రామస్తులతో కలిసి మత్స్యగెడ్డలో నిరుపయోగంగా ఉన్న కేజ్ కల్చర్‌ను పరిశీలించారు. కేజ్ కల్చర్‌ను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కేజ్ కల్చర్ ద్వారా చేపల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సాగర మత్స్య పరిశోధన సంస్థ శాసవేత జె.కె.ఖుజురుద్దీన్ మాట్లాడుతూ కేజ్ కల్చర్ ద్వారా చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. చేపలకు క్రమం తప్పకుండా పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు వాటి ఆహారం అందించాలని సూచించారు. అనంతరం టిఎస్‌పి నిధులు రూ.50వేలతో చేపల వేట కోసం పడవను సుజనకోట గిరిజన మత్స్యకారులకు అందించారు.శాస్త్రవేతలు జయశ్రీ, రితేష్‌రంజన్, శేఖర్ మగరజన్, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, సర్పంచులు రమేష్, బాబురావు, గిరిజన మత్స్యకారులు పాల్గొన్నారు.

బస్సే.. మృత్యువై..

- రోడ్డు ప్రమాదంలో యువ ఇంజినీర్ దుర్మరణం
- తమ్ముడిని బస్సు ఎక్కించి వస్తుండగా ప్రమాదం

గోపాలపట్నం(విశాఖ): గోపాలపట్నం బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డు రక్తసిక్తమైంది. నిండు జీవితం, భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఓ యువ ఇంజినీర్ అర్ధాంతరంగా తనువు చాలించాడు. తమ్ముడిని క్షేమంగా ఆఫీస్‌కు దిగబెట్టేందుకు వెళ్లిన అన్నను బస్సు రూపంలో వచ్చిన మృత్యువు బలిగొంది. ఈ హృదయ విదారక ఘటన గోపాలపట్నంలో చోటుచేసుకుంది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపాలెం ఆదర్శనగర్‌కు చెందిన ఒమ్మి వెంకట బాలాజీ, తన తమ్ముడు వేణుగోపాల్‌ను గోపాలపట్నంలో దించేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. సింహాచలం రైల్వేస్టేషన్ వద్ద బస్సు ఎక్కించిన బాలాజీ, తిరిగి ఇంటికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. రామ్‌రాజ్ కాటన్ దుకాణం వద్ద రఘు ఇంజినీరింగ్ కళాశాల బస్సు వేగంగా వచ్చి బాలాజీ నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి.. కొంతదూరం ఈడ్చుకుపోయింది. ఈ దుర్ఘటనలో బాలాజీ తలపై నుంచి బస్సు వెళ్లడంతో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన బాలాజీ ప్రస్తుతం షిప్‌యార్డులో అప్రెంటిస్ చేస్తున్నాడు. తండ్రి ఆదినారాయణ, అన్న కార్పెంటర్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తమ్ముడు వేణుగోపాల్ సత్యం జంక్షన్ వద్ద డబ్ల్యూఎన్ఎస్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. కుమారుడి మరణవార్త విన్న తండ్రి ఆదినారాయణ ఘటనా స్థలానికి చేరుకుని గుండెలు పగిలేలా రోదించారు. 'ప్రతిరోజూ నేనే వేణుగోపాల్‌ను దిగబెట్టేవాడిని. ఈరోజు బాలాజీ వెళ్లాడు, నా కొడుకుని పోగొట్టుకున్నాను'అంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. ట్రాఫిక్ సీఐ జి.శ్రీనివాసరావు, లా అండ్ ఆర్డర్ ఎస్ఐ అప్పలనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆదినారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

మహా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు



తాటిచెట్లపాలెం(విశాఖ): ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా కోసం భారతీయ రైల్వే పలు ప్రత్యేక రైళ్లు నడుపుతుంది. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, తిరుపతి, గుంటూరు స్టేషన్ల నుంచి బయల్దేరుతుతున్న ప్రత్యేక రైళ్లు ఇలా ఉన్నాయి.

- విశాఖపట్నం-పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్(08530) స్పెషల్ విశాఖలో ఈ నెల 6, 20, 27వ తేదీల్లో సాయంత్రం 5.35 గంటలకు బయల్దేరి ఈనెల 8, 22, మార్చి 1వ తేదీల్లో తెల్లవారుజామున 4.30 గంటలకు పండిట్‌దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్- విశాఖపట్నం (08529) స్పెషల్ ఈ నెల 8, 22, మార్చి 1వ తేదీల్లో రాత్రి 8.10గంటలకు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్‌లో బయల్దేరి ఈ నెల 10, 24, మార్చి 3వ తేదీల్లో తెల్లవారుజామున 3.25 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నం-గోరఖ్‌పూర్(08562) స్పెషల్ ఈ నెల 16వ తేదీన రాత్రి 10.20 గంటలకు విశాఖపట్నంలో బయల్దేరి 18వ తేదీ రాత్రి 8.25 గంటలకు గోరఖ్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో గోరఖ్‌పూర్-విశాఖపట్నం(08561) స్పెషల్ ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం 2.20 గంటలకు బయల్దేరి 21వ తేదీ మధ్యాహ్నం 12.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.
- కాకినాడటౌన్-గయ జంక్షన్(07095) స్పెషల్ ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు కాకినాడలో బయలేరుతుంది. తిరుగు ప్రయాణంలో గయ జంక్షన్-విజయవాడ(07096) స్పెషల్ గయ జంక్షన్‌లో ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 2.15 గంటలకు బయల్దేరి విజయవాడ చేరుకుంటుంది.
- తిరుపతి-బనారస్(07107) స్పెషల్ ఈ నెల 8, 15, 22వ తేదీల్లో రాత్రి 8.55 గంటలకు తిరుపతిలో బయల్దేరి బనారస్ చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో బనారస్-విజయవాడ (07108) ఈ నెల 10, 17, 24వ తేదీల్లో సాయంత్రం 5.30 గంటలకు బనారస్‌లో బయల్దేరి విజయవాడ చేరుకుంటాయి.
- గుంటూరు జంక్షన్-ఆజంగఢ్(07081) స్పెషల్ ఈనెల 14వ తేదీన గుంటూరులో రాత్రి 11గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఆజంగఢ్-విజయవాడ (07082) స్పెషల్ ఈనెల 16వ తేదీన ఆజంగడ్‌లో రాత్రి 7.45 గంటలకు బయల్దేరుతుంది.
- కాకినాడ టౌన్-ఆజంగఢ్(07085) స్పెషల్ ఈ నెల 20వ తేదీ రాత్రి 8.10 గంటలకు కాకినాడ టౌన్‌లో బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఆజంగడ్-విజయవాడ (07086) స్పెషల్ ఈ నెల 22వ తేదీ రాత్రి 7.45 గంటలకు ఆజంగడ్‌లో బయల్దేరుతుంది.

కేజీహెచ్‌లో బాలిక ప్రసవం

భీమునిపట్నం(విశాఖ) : బాలిక ప్రసవంపై గురువారం భీమిలి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ బొడ్డేపల్లి సుధాకర్ తెలిపిన వివరాలివీ.. అనకాపల్లి జిల్లా చీడికాడకు చెందిన 17 ఏళ్ల బాలిక భీమిలిలోని ఓ వసతి గృహంలో ఉంటూ కళాశాలలో చదువుతోంది. చీడికాడకు చెందిన 18 ఏళ్ల యువకుడితో చనువుగా ఉంటోంది. బాలిక గర్భం దాల్చింది. ఈ విషయం ఎవరికీ తెలియకుండా దాచిపెట్టింది. గురువారం ఉదయం కడుపునొప్పి రావడంతో కేజీహెచ్‌కు వెళ్లగా.. వైద్యులు పరీక్షించి ప్రసవం చేశారు. మగబిడ్డ పుట్టి చనిపోయాడు. కాగా బాలిక ప్రసవం కావడంపై వైద్యులు భీమిలి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాలిక నుంచి వివరాలను సేకరించినట్లు సీఐ తెలిపారు. చీడికాడకు సంబంధించి వ్యవహారం కావడంతో అక్కడ పోలీసులకు ఈ కేసు వివరాలు అందిస్తామన్నారు.

ఊహకందని కథతో 'తల'


సమావేశంలొ పాల్గొన్న చిత్ర యూనిట్

బీచ్‌రోడ్డు(విశాఖ): ప్రేక్షకులు ఊహలకు అందని ఎన్నో మలుపులతో 'తల'సినిమా ఉంటుందని దర్శకుడు అమ్మ రాజశేఖర్ అన్నారు. తల చిత్ర ప్రమోషన్‌లో భాగంగా గురువారం నగరంలో హీరో, దర్శకుడు, సినిమా బృందం సందడి చేసింది. ఈ సందర్భంగా సిరిపురంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దర్శకుడు మాట్లాడారు. ఈ నెల 14న ప్రపంచవ్యాప్తంగా తల సినిమా విడుదలవుతుందని, ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుందన్నారు. ప్రస్తుతం టీనేజ్ ప్రేక్షకులే అధికంగా సినిమా థియేటర్లకు వస్తున్నారన్నారు. అమ్మ రాజశేఖర్ కుమారుడు, హీరో రాగిని రాజ్ మాట్లాడుతూ చాలా మంది నటులు ప్రేమ కథలతోనే పరిచయమవుతారని, తాను ఓ మంచి కంటెంట్ ఉన్న కథతో హీరోగా ప్రేక్షకుల ముందుకు వస్తున్నట్లు తెలిపారు. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుందన్నారు. హాస్య నటుడు అవినాష్ మాట్లాడుతూ బిగ్‌బాస్ షోలో ఇచ్చిన మాట ప్రకారం అమ్మ రాజ శేఖర్ ఈ సినిమాలో తనకు అవకాశం ఇచ్చారని ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రేమికుల దినోత్సవం రోజున వైలెంట్ వాలెంటైన్‌గా హీరో అందరికీ నచ్చుతాడన్నారు.

రసాయనాలు లేకుండా వ్యవసాయం సాధ్యం

- ఏపీసీఎన్ఎఫ్‌ను మోడల్‌ను అభినందించిన శ్రీలంక ప్రతినిధి బృందం

మహారాణిపేట(విశాఖ): ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలను అనుసరించడం ద్వారా రసాయనాలను ఉపయోగించకుండా వ్యవసాయం సాధ్యమని శ్రీలంక ప్రతినిధి బృందం, రైతులు తెలిపారు. రైతు సాధికార సంస్థ(ఆర్‌వైఎస్ఎస్) రాష్ట్రంలో అమలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్(ఏపీసీఎన్ఎఫ్) నమూనా బృంద సభ్యులను ఆకట్టుకుంది. రాష్ట్రంలో 11 రోజుల పాటు పర్యటన పూర్తి చేసుకున్న శ్రీలంక ప్రతినిధి బృందం గురువారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తమ అనుభవాలను పంచుకుంది. ఈ సందర్భంగా శ్రీలంక సర్వోదయ ఫౌండేషన్ ప్రతినిధి చమారి మాట్లాడుతూ రైతులు అమలు చేస్తున్న ఏటీఎం(ఎనీ టైం మనీ), ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఏ గ్రేడ్ వంటి విభిన్న నమూనాల ద్వారా తాము చాలా అంశాలు నేర్చుకున్నట్లు తెలిపారు. కొంత మంది రైతులు తమ దేశంలో రసాయనాలు వాడుతున్నారని, ప్రకృతి వ్యవసాయ విధానంలో రసాయనాలు అవసరం లేకుండా ప్రకృతి వ్యవసాయం చేయవచ్చని గ్రహించామన్నారు. శ్రీలంక దేశంలో కూడా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అమలు చేయడానికి ఉత్సాహంగా ఉన్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సందర్శనలను ఏర్పాటు చేసిన ఆర్‌వైఎస్ఎస్‌కు కృతజ్ఞతలు చెప్పారు. ప్రియదర్శిని అనే మహిళ రైతు మాట్లాడుతూ ఏటీఎం మోడల్‌పై ఆసక్తి ఏర్పడిందన్నారు. శ్రీలంకలో నీరు ఎక్కువగా లభ్యమవుతుందని.. ఏటీఎం(ఎనీటైం మనీ) తక్కువ నీటితో కూడా అమలు చేయగలిగే విధానమన్నారు. అనంతపురం వంటి పొడి ప్రాంతాల్లో కూడా ఉపయోపడగేలా తీర్చిదిద్దారని కొనియాడారు. ఈ మోడల్‌ను శ్రీలంకలో విస్తరించేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్ వర్చువల్‌గా సమావేశంలో పాల్గొని.. ప్రకృతి వ్యవసాయం ప్రారంభించేందుకు ఆసక్తి చూపించిన శ్రీలంక రైతులను అభినందించారు. రైతు సాధికార సంస్థ ప్రతినిధులు వి.కృష్ణారావు, హేమ సుందర్, ప్రకాష్‌రావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కందిపప్పు ఎప్పుడొస్తుందో?

- మూన్నాళ్ల ముచ్చటగా కందిపప్పు పంపిణీ
- ఈ నెల ఇప్పటి వరకు ఇవ్వని కూటమి ప్రభుత్వం
- రేషన్‌కార్డుదారుల ఎదురుచూపులు



మహారాణిపేట(విశాఖ): పేద ప్రజలకు ఇస్తున్న అరకొర సరకుల్లో కూటమి ప్రభుత్వం కత్తెర వేస్తోంది. అప్పుడప్పుడు ఇచ్చే సరకులను ఇంకా కుదించేస్తోంది. ముఖ్యంగా కందిపప్పు సరఫరా మూన్నాళ్ల ముచ్చటగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు దాటినా, రేషన్ దుకాణాల ద్వారా ఇప్పటికీ పూర్తి స్థాయిలో నిత్యావసరాలను అందించడం లేదు. ఎన్నికలకు ముందు రేషన్ డిపోల ద్వారా అన్ని రకాల నిత్యావసరాలు అందిస్తామని హామీలు గుప్పించిన చంద్రబాబు, ఇప్పుడు బియ్యం, పంచదారతోనే సరిపెట్టేస్తున్నారు. ఈ నెలలో బియ్యం, పంచదార పంపిణీ దాదాపు పూర్తి కాగా, కందిపప్పు అందజేయలేదు. ఇలా రేషన్ కార్డుదారులకు కొత్త నిత్యావసరాలు అందించకపోగా, ఉన్న సరుకుల్లో కోత పెట్టారు.

పెరిగిన ధరలతో విలవిల

ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యమైన కందిపప్పు రూ.140 నుంచి రూ.180 పలుకుతోంది. ఇంత ఖరీదుతో కందిపప్పు కొనుగోలు చేసి తినే పరిస్థితి పేదలకు లేదు. దీంతో రేషన్ షాపుల ద్వారా ఇచ్చే కందిపప్పు కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో కందిపప్పుకు మంచి గిరాకీ ఉంది. జిల్లాలోని 5,12,619 తెలుపు కార్డుదారుల కోసం నెలకు 512 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం ఉంటుంది. అక్టోబర్‌లో 30 టన్నుల కందిపప్పు విడుదల కాగా, రేషన్ డిపోకు వంద కిలోల చొప్పున కొన్ని డిపోలకు కేటాయించారు. పలుకుబడి ఉన్న వారు దక్కించుకోవడంతో అన్ని ప్రాంతాలకు కందిపప్పు అందలేదు. పండగ నేపథ్యంలో జనవరిలో కందిపప్పు అందించారు. ఫిబ్రవరిలో మళ్లీ పంపిణీ నిలిపివేయడంతో లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు.

ప్రస్తుతం అర్బన్ డీఎస్‌వో పరిధిలో మధురవాడ, ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి తదితర ప్రాంతాలు ఉన్నాయి. జిల్లాలో 5,12,619 తెలుపు కార్డులతో పాటు 625 చౌకధరల డిపోలు ఉన్నాయి. ఒక జిల్లా సప్లయి అధికారి(డీఎస్‌వో) ఆధ్వర్యంలో ముగ్గురు అసిస్టెంట్ సప్లయి ఆఫీసర్లు(ఏఎస్‌వో)లతో కలిపి 21 మంది చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు, నాలుగు మండలాల డిప్యూటీ తహసీల్దార్లు(సీఎస్ డీటీ) ఈ విభాగంలో పనిచేస్తున్నారు. జిల్లాలో డోర్ టూ డోర్ పంపిణీ కోసం 310 వాహనాలను ఉపయోగిస్తున్నారు. రెండు, మూడు రేషన్ డిపోలకు కలిపి వాహనాల ద్వారా సరకులు అందిస్తున్నారు.